

అసంపూర్తి పనులతో తంటాలు
- నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు
- వర్షాకాలంలో మొదలైన కష్టాలు

6

సమస్యల వలయంలో సర్కారు బడులు
- అరోకర వసతులు ఆరుబయట చదువులు
- జిల్లాలో 22 పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు

7



కార్యాలయ నిర్మాణానికి భూమి చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

భవన నిర్మాణానికి భూమిపూజ

జన్నారం, జూన్30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇరిగేషన్ సబ్‌డి విజన్ భవననిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అందుబాటు లో ఉంటూ పేదల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయానికి 35.5లక్షల నిధులు వెచ్చించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులతో పాటు మండల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

మందమర్రిటౌన్, జూన్30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఇతరు లను రెచ్చగొట్టేలా, విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠినచర్యలు ఉంటాయని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా వ్యక్తులను కించపరిచేలా ఉండకూడదన్నారు. ఒకరిని కించపరుస్తూ, రెచ్చగొట్టేలా పోస్టులు చేయవద్దని, దీనిపై అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫ్యాక్టరీలో ప్రమాదాన్ని పరిశీలించిన మంత్రి

మందమర్రిటౌన్,జూన్30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పాశమైలారం ఫ్యాక్టరీలో సోమవారం జరిగిన పేలుడు ప్రమాదాన్ని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి వివేక్ పరిశీలించా రు. ప్రమాద తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

‘ఎత్తిపోతలు’ ముగిసినట్లేనా..?



ఎత్తిపోతల పథకం కోసం ఎంపిక చేసిన స్థలం

- హాజీపూర్ మండలంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మాణానికి హామీ
- రూ. 80.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక
- పరిపాలనా అనుమతుల జారీతోనే సరి
- పనులకు అప్రూవల్ ఇవ్వని కేసీఆర్ సర్కారు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ చూపాలని వేడుకోలు

మంచిర్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎత్తిపోతల పథకానికి ఆదిలోనే హంస పాదు పడగా, కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలనే విజ్ఞప్తులు ఆయకట్టు రైతుల నుంచి వినిపిస్తు న్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరుగగా, పరిపాలన అనుమతుల జారీ తోనే సరిపెట్టారు. పడ్తనపల్లి వద్ద గోదావరి బేసిన్‌లో కడెం కెనాల్ డిస్ట్రిబ్యూటరీ 42పై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు రూపలక్పన చేశారు. మంచిర్యాల నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఎత్తిపోతల పథక నిర్మాణం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుని కేసీఆర్ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. దీంతో పథకానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. పథకం నిర్మాణం జరిగితే చివరి ఆయకట్టు వరకు నీరంది పంటలు బాగా పండుతాయని గంపెడాశ పెట్టుకున్నారు. అయితే రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ కేసీఆర్ సర్కారు ఎత్తిపోతల పథకానికి మంగళం పాడింది.

గూడెం ఎత్తిపోతలకు కొనసాగింపుగా....

మంచిర్యాల దండేపల్లి మండలంలో ఉన్న గూడెం లిఫ్ట్ ఇరిగేషన్‌కు కొనసాగింపుగా హాజీపూర్ మండలం పడ్తనపల్లి వద్ద గోదావరిపై ఎత్తిపోతల పథకానికి రూప కల్పన చేశారు. గూడెం గ్రామం వద్ద 3 టీఎంసీల సామర్థ్యంతో రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించిన పథకం ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సుమారు 40వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. అయితే లిఫ్ట్ తరుచుగా మొరాయించడంతో ఆ లక్ష్యం నెరవేరడం లేదు. లిఫ్ట్‌కు అమర్చిన రెండు మోటార్లలో ఏదో ఒకటి తరుచుగా మొరాయించడం వంటి సమస్యల కారణంగా గూడెం లిఫ్ట్‌పై ఆధారపడ్డ ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గూడెం లిఫ్ట్‌కు కొనసాగింపుగా పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి రూప కల్పన చేశారు. గూడెం లిఫ్ట్‌ను దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలకు పరిమితం చేసి హాజీపూర్, లక్సెట్టిపేట ఆయకట్టుకు పడ్తనపల్లి లిఫ్ట్ నుంచి సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు.

డీపీఆర్ ఇలా...

ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో పడ్తనపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కోసం నీటిపారుదలశాఖ ఇంజనీర్లు డిటెయిల్డ్ ప్రాజెక్టురిపోర్టు (డీపీఆర్)ను రూపొందించారు. ఇందులో భాగంగా రూ. 83.51 కోట్ల అంచనా వ్యయాన్ని తయారు చేయగా, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 80.50 కోట్లకు పరిపాలనా...

(తరువాయి 7లో)

డిపో, బస్టాండ్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను ఆధునీ కరణ, అభివృద్ధికి ప్రభు త్వం కృషి చేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల డిపో, బస్టాండ్‌ను సందర్శించి అధికారులతో సమీక్షించారు. బస్టాండ్ అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఇవ్వాలని త్వరలోనే సంబంధిత శాఖకు, రవాణాశాఖ మంత్రి, సీఎంతో మాట్లాడి నిధులు సేకరించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అభి వృద్ధి పనులకు సంబంధించి అధికారులు భాగస్వాములు కావాలని, నిత్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్, డిపో మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● ఆర్టీసీ ఆర్‌ఎం భవానీ ప్రసాద్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తం గా వ్యవహరించాలని ఆర్టీసీ ఆర్‌ఎం భవా నీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జి ల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గ్యారేజీ, టైర్స్, ఆయిల్ సెక్షన్‌లు, మెయింటనెన్స్ స్టోర్‌లను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలోని ప్రతి ఉద్యోగి విధుల పట్ల అంకిత భావంతో వ్యవహరిం చాలన్నారు. వివిధ సెక్షన్‌లలోని సిబ్బంది నిర్వహిస్తున్న పనులను అడిగి తెలుసుకు న్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృ ష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట డీఎం శ్రీనివాసులు, అసిస్టెంట్ డీఎం శ్రీలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, కోటపల్లి, జైపూర్, కోటపల్లి, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, రామారావుపేట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి..

జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ కాలేజీ రోడ్డు చౌరస్తావద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి వినతి పత్రం అందించారు. కాలేజీ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జివద్ద గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కూరగాయలు రోడ్లకిరువైపులా పెట్టి విక్రయిస్తున్నారని, దీంతో పార్కింగ్‌కు స్థలం లేక ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాంగ్‌పార్కింగ్ పేరిట చలాన్‌లు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తుల మధుసూదన్‌రావు, మున్నారా జాసిసోడియా, రాము, విజయ్ కుమార్, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రావు, మల్లేష్ శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

బెల్లంపల్లి, జూన్30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెల్లంపల్లి బస్తీలో మున్సిపల్ అధికారులు రహదారుల పక్కన దుకణాలను కూల్చివేశారని బాధితులకు న్యాయం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మున్సిపల్ అధికారులు దుకాణాలను కూల్చివేసే సమయంలో ఎవరికి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారని దీంతో ఎంతో మంది పేద మధ్యతరగతి వ్యాపరస్తులు రోడ్డున పడ్డారన్నారు. ఆకస్మత్తుగా కూల్చివేయడంతో ఆస్తి నష్టం జరిగిందని విచారణ జరిపి బాదితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో నిరుపేదల ఆశ్రయం కోల్పోయే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడం సరైందికాదన్నారు. బాధిత కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యేతో పాటు అధికారులు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ పట్టణ అధ్యక్షులు మహేశ్ మాదిగ , నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి

నస్పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 132మంది కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు జిల్లా మున్సిపల్ కాంట్రాక్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ 132మంది కార్మికులకు సంబందించి పీఎఫ్, ఈ ఎస్ఐ కొన్నేళ్లుగా కార్మికులఖాతాల్లో జమ కావడం లేదన్నారు. కార్మికుల వేతనాలనుంచి కట్ చేసినప్పటికి వారికి పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేయలేదన్నారు. 2020 నుంచి 2022 వరకు మూడేళ్లకు సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము జమ కావాలన్నారు. ఆరేళ్లుగా పని చేసిన 86మంది కార్మికులను ఏప్రిల్‌లో తొలగించారని, వారిని తిరిగి తీసుకోవాలని కోరారు. సంఘం నస్పూర్ అధ్యక్షుడు కొయ్యల వెంకట్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

మందమర్రిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం రూ. 6 వేల పింఛన్ చెల్లించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్ దివ్యాంగులకు అమలు చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కూడా అమలు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెన్షన్ రూ. 6 వేలు చెల్లించాలన్నారు. పుట్టుకతో పాటు అంగవైకల్యం ఉన్న వారు పెన్షన్‌పైనే ఆధారపడతారని, వెంటనే పెన్షన్ పెంచాలని కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ధర్నా

కాగజ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం బురదగూడలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని గ్రామస్థులు ట్రాన్స్ కో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో కరెంటు సరఫరా సక్రమంగా ఉండటం లేదని ఒక వైపు వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్ కో అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 49ను రద్దు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు

ఆసిఫాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాను కన్జర్వేషన్ రిజర్వును ప్రకటిస్తూ జీవో నంబర్ 49ని జారీ చేశారని వెంటనే దానిని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, శ్రీనివాస్, బాపురావు, రాజేందర్, దినకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: జీవో నంబర్ 49ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు బక్కన్న, దామోదర్, కమల, లక్ష్మి, నర్సింహులు, రజిత, తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ తదితరులు

జైనూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. వన మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థానిక కన్యకాపరమేశ్వరీ వాసవి మాత మందిర ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ విశ్వనాథ్ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలని సూచించారు. ఆనంతరం టెన్నిస్ క్రికెట్ పోటీలో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మం డలాలకు చెందిన క్రీడాకారులను సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మండాడి లింగు, పంద్ర షేక్బు, నాయకులు మేస్రాం అంబాజీ, బాబు పఠాన్, దండుగుల మహేష్, కనక గంగారాం, కుంరం శంకర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో తంటాలు

- నిలిచిపోయిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు
- వర్షాకాలంలో మొదలైన కష్టాలు


గుంతలమయంగా మారిన పులికుంట రోడ్డు

రెబ్బెన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం బీటీ రోడ్లను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేయకపోగా బిల్లులు అందలేదన్న సాకుతో అర్థాంతరంగా పనులను ఆపేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ రోడ్లు బురదమయంగా మారిపోతున్నాయి. బీటీ రోడ్డు పూర్తి అయితే తమ కష్టాలు తీరుతాయన్న ఆశ నిరాశగానే మిగిలింది. వర్షాకాలం మొదలు కావటంతో మట్టి రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితులలో దేవుడిపై భారం వేసి కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన అవాస ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఐటీడీఏ నిధులు కేటాయించింది.

మొదటి విడతలో రూ. 3.96 కోట్లు..

గిరిజనుల నివాసం ఉండే గ్రామాల్లో కనెక్టివిటీ, నాన్ కనెక్టివిటీ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయగా, మొదటి విడతలో మండలానికి 3.96 కోట్ల రూపాయలు, నాలుగు గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో ఒక్కరోడ్డు కూడా ఇంతవరకు పూర్తి కాలేదు. పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కొత్తపులికుంట వరకు కిలోమీటర్లు రూ.1.16 కోట్లు, నారాయణపూర్ పంచాయతీలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పైకాజీగూడ వరకు రూ.1.05 కోట్లతో 1.2 కిలోమీటరు, రాంపూర్ పంచాయతీ పరిధిలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రాంపూర్ గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు, రోళ్లపాడు పంచాయతీలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రోళ్లపాడు గ్రామానికి 12 కిలోమీటరు మేర రోడ్డు మంజూరు చేసింది.

రెండో విడతలో రూ. 3.60 కోట్లు..

రెండో విడతలో పైకాజీగూడకు మూడు కిలోమీటర్ల బీటీరోడ్డుతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం 3.60 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. సంవత్సరంలోగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రోళ్లపాడు రోడ్డు మాత్రమే పూర్తి చేశారు. రాంపూర్ రోడ్డుపై కంకర వేసి తారు వేయకుండానే వదిలేశారు. దాంతో కంకరతో కూడిన రోడ్డుపై ప్రయాణించలేక ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటనలు ఉన్నప్పటికీ అధికారులు ఈ పనులపై ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. కొత్తపులికుంటకు మంజూరైన రోడ్డు విస్తరించి మట్టిపోసి వదిలేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు గుంతలు పడి బురదమయంగా మారాయి. కనీసం 108 వాహనంపోలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే పైకాజీగూడకు మంజూరైన రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కూడా కాలేదు.

మట్టి రోడ్డే దిక్కు..

మండలంలోని కొత్తపులికుంట, పైకాజీగూడ గ్రామాలకు గతంలో కనీసం మెటల్ రోడ్డు సౌకర్యం కూడా అందుబాటులో లేదు. గ్రామాలు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు మట్టి రోడ్డు గ్రామస్థులకు దిక్కుగా మారింది. గత ప్రభుత్వం హయాంలో ఐటీడీఏ నిధులతో బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ పనులు పూర్తికాకపోవటంతో ఆయా గ్రామాలకు మట్టి రోడ్డే దిక్కు అయ్యాయి. పైకాజీగూడ మధ్యలో సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉండగా, వర్షాకాలంలో గ్రామానికి కనీసం నడిచి వెళ్లే పరిస్థితి ఉండదు. అత్యవసర పరిస్థితులు వస్తే ఎడ్ల బండిపై నారాయణపూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి పెండింగ్ పనులను పూర్తి అయ్యేట్లు చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్త పులికుంటకు రోడ్డు నిర్మించాలి..
సుధాకర్, గ్రామస్థుడు, పులికుంట



కొత్తి పులికుంటకు రోడ్డు నిర్మించాలి. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవటంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం ప్రస్తుతం ఉన్న రోడ్డుపై ప్రయాణించటం ప్రమాదకరంగా మారింది. రోడ్డు పూర్తిగా ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి బురదమయంగా ఉంది. ద్విచక్ర వాహనాలు కూడా మట్టిలో కూరుకుపోతున్నాయి. నడవలేని పరిస్థితి ఉంది.

హాకా సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న హాకా (అగ్రికల్చర్ కో ఆపరేటివ్) సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ జిల్లా కలెక్టర్ వెంకటేష్‌దోత్రేకు ఫిర్యాదు చేశారు. వాంకిడి మండలంలోని హాకా ఫార్మా సెంటర్ల నిర్వాహకులకు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, రైతులకు ఇవ్వాల్సిన యూరియాను ప్రైవేటు ట్రేడర్స్‌కు విక్రయిస్తున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కెరమెరి: ఆదివాసీ రైతులను మోసం చేస్తున్న హాకా సెంటర్ (అగ్రికల్చర్ కో ఆపరేటివ్) నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన ఎరువులను రైతులకు అమ్మకుండా ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారని, రైతులు వెళ్తే స్టాక్ లేదని దుకాణం యజమానులు చెబుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నాన్ ట్రైబల్స్‌కు డీలర్‌షిప్ పొందాలన్నా పీసా చట్టం తీర్మాణం అవసరమని కానీ ఎలాంటి తీర్మాణం లేకుండా నాన్ ట్రైబల్ వ్యక్తులకు డీలర్‌షిప్ ఇవ్వడం ఆదివాసీల హక్కులను కాలరాయడమేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రాజేశ్వర్, తుకారాం, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నెన్నెల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చిన్న వెంకటాపూర్ పంచాయతి పరిధిలోని కొంపల్లికి చెందిన పాడిరైతు జక్కుల రాజేష్‌కు చెందిన ఆవు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామ శివారులోని పంట పొలాల్లో మేస్తున్న ఆవుకు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆవు విలువ రూ. 60 వేలు ఉంటుందని, తనకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి

చింతలమానేపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లకు మండ లంలోని రుద్రాపూర్, చింతలమానేపల్లి, కర్జెల్లి గ్రామాల్లో అధికారులు, నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ సాహిల్ అహ్మద్, కార్యదర్శి ఆసీఫ్ అలీ, ఇస్తారి, శేఖర్, శంకర్, వందన, సత్తన్న, రమేష్ పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని తలోడి, గురుడుపేట, కన్నెపల్లి, బోధంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గంగారాం, పోశం, నహీం, కోటేశ్వర్, చంద్రశేఖర్, చెన్నమల్లు, భీంరావు, రమేష్, శంకర్, హౌజింగ్ ఏఈ, ఏపీవో పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని ప్రెసిడెంట్ గూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ భుమి పూజ చేశారు. గ్రామ కార్యదర్శి కనక అవినాష్, మాజీ సర్పంచులు ఆత్రం ఓంప్ర కాష్, పెందుర్ నాగోరావ్, నాయకులు ఆత్రం దౌలత్‌రావ్, ఆత్రం లచ్చు, భీమన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎరువులను పక్కదారి పట్టిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

పెంచికలపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎరువులను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. సోమవారం మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నిల్వ అమ్మకాలకు సంబంధించిన అకౌంట్లను పరిశీలించారు. యూరియా తీసుకున్నట్లు నమోదు చేసిన రైతులకు ఫోన్‌చేసి ఏ ధరకు కొనుగలు చేశారని అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు యూరియా అమ్ముతున్నారని యూరియాతో పాటు మిగితా ఎరువులు కూడా అంటగడుతున్నారని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. వారివెంట తహసీల్దార్ పుష్పలత, ఏవో మనీషా ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- కుమరం భీం ఎస్పీ కాంతిలాల్ పాటిల్


హోంగార్డ్స్‌కు రెయిన్ కోట్‌లు అందజేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కారం కోసం సంబంధింత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ వారి సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. పోలీసు లు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రత పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తోందని ఎస్పీ తెలిపారు.

హోంగార్డ్స్, సిబ్బంది సంక్షేమానికి చర్యలు

హోంగార్డు, సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ఉలెన్ జాకెట్స్, రెయిన్ కోట్స్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారన్నారు. హోంగార్డ్స్‌లకు, సిబ్బందికి సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి విద్యాసాగర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

జిల్లాలో పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. లింగాపూర్ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ గణేష్ నాయక్ ఏప్రిల్ 4న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన సతీమణికి భద్రత ఎక్స్‌గ్రేషియా రూ.8 లక్షలు, కార్పస్ ఫండ్ కింద లక్ష రూపాయలు మొత్తం రూ.9 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐ రాణా ప్రతాప్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ్‌శంకర్‌రెడ్డి, ఆర్ఐ అడ్మిషన్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యం

ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఎస్సై రాజయ్యను జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా నియామకమై 35 సంవత్సరాల సర్వీసులో వారికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారన్నారు. సర్వీసు మొత్తంలో ఎలాంటి రిమార్కు లేకుండా హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సై, సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు సంఘం జిల్లా అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ రాణాప్రతాప్, ఆర్ఐ అంజన్న, ఎస్సై రాజయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలి

కాగజ్‌నగర్: మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన చేస్తే యువత పెడదారిపడకుండా ఉంటారని తెలిపారు. డ్రగ్స్ బారిన పడి యువత జీవితాలను కోల్పోతున్నట్టు పేర్కొన్నారు. యువత మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. గంజాయి అమ్మకాల గురించి సమాచారం ఉంటే వెంటనే 1908 టోల్‌ఫ్రీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో మెడికల్ అధికారి డాక్టర్ రవిచంద్ర, సీఐ ప్రేంకుమార్, ఎస్సైలు సుధాకర్, సురేష్, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని పెట్రోల్ పోసుకొని బెదిరింపు

జన్నారం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లిస్టులో తన పేరురాలేదని ఒంటిపై పెట్రోల్ పోసుకొని బెదిరింపులకు దిగిన ఘటన మండలంలోని మహ్మదాబాద్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల మేరకు మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం రాజమల్లు ఇటీవల మంజూరైన ఇందిరమ్మ లిస్టులో తన పేరు రాలేదని గ్రామ కార్యదర్శి కోట మహేశ్ వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగాడు. తనకు ఇల్లు రాకపోవడానికి కారణం మీరే అంటూ అతడిని దూషించారు. అనంతరం తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని భయభ్రాంతులకు గురిచేశాడు. కార్యదర్శి మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శాశ్వత నివాసితులకు పట్టాలు అందించాలి

శ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి స్థలాల్లో శాశ్వతంగా ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. సోమవారం వారు బాధితులతో కలిసి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్‌వోటు జీఎం సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నస్పూర్ పట్టణంలోని సింగరేణి స్థలాల్లో చాలా మంది శాశ్వతంగా నివాసం ఉంటున్నారన్నారు. నిరుపేదలైన అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్రం రమేష్, గాజుల ముఖేష్‌గౌడ్, ఎనగందుల కృష్ణమూర్తి, మోటపలుకుల తిరుపతి, కమలాకర్‌రావు, సతీష్‌రావు, మొగిలి, మధు, వెంకట కృష్ణ, దుర్గం అశోక్, సదయ్య, చక్రి పాల్గొన్నారు.

డబ్బులను పొదుపు చేసుకోవాలి

రెబ్బెన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు డబ్బులను పొదుపు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో పదవి విరమణపొందుతున్న జనరల్ అసిస్టెంట్ లక్ష్మిని ఘనంగా శాలువాతో సన్మానించారు.

రెబ్బెన: ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పదవీవిరమణ పొందిన కార్మికుడు రాజలింగును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, మేనేజర్ జయశంకర్,సెఫ్టీ అధికారి గౌతం, రాజేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: ఏరియాలోని కేకే 5 గనికి చెందిన ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ సురేందర్, మరో ఇద్దరు ఉద్యోగులు పదవీ విరమణ పొందగా సోమవారం గనిపై కేకే 5 గని మేనేజర్ శంభునాథ్ పాండే ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన సంస్థకు చేసిన కృషి మరువలేనిదని మేనేజర్ శంభునాథ్ పాండే అన్నారు. కార్యక్రమంలో గని అధికారులు, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ ఆఫీసర్ బుచ్చయ్య ఉద్యోగ విరమణ పొందగా జీఎం దేవేందర్ శాలువాలతో సన్మానించారు.

ఏరియా సమస్యలను పరిష్కరించండి


స్ట్రక్చర్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏరియాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. సోమవారం జీఎం ఎం. శ్రీనివాస్‌తో నిర్వహించిన స్ట్రక్చర్ సమావేశంలో వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ పోస్టులను గుర్తించి, తగిన ఉద్యోగులతో భర్తీ చేయాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన టర్మినల్ బెనిఫిట్స్, ఎంఎంసీ, ఇతర సమస్యలకు సంబంధించిన కేసుల వివరాలను తమ యూనియన్‌కు అందించాలని, తాము కార్మికులతో చర్చించి అవసరమైన డాక్యుమెంట్లను యాజమాన్యానికి అందించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల డీజీఎంలు, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కొట్టె కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి

శ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు చెందిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ కేంద్ర నాయకుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం వారు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌కు 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి అమలు చేయాలని చూస్తోందని, ఇందుకు నిరసనగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి పొనగంటి అశోక్, ఇతర నాయకులు, అన్నిగనులు, విభాగాల పిట్ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె పోస్టర్లను సీసీసీలోని జీటీ హాస్టల్‌లో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు రమేష్, కిషన్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకులు కాంతయ్య, సత్యం, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

శ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. నస్పూర్ డిస్పెన్సరీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పైరో మెట్రీ, ఆడియో మెట్రీ పరికరాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు లక్షల రూపాయల విలువగల పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్య పరిరక్షణకు సంస్థ ద్వారా అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని ఏరియా ఉద్యోగులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

రిటైర్ అయిన పలువురు ఉద్యోగులను జీఎం శ్రీనివాస్ సోమవారం ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి క్వాలిటీ జనరల్ మేనేజర్ సుశాంత్ సాహా, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ కల్లూరి వెంకటరామారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేదవ్యాస్, తదితరులను సత్కరించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను జీఎం ఎం. శ్రీనివాస్, ఆర్‌కే 6 గనిలో మేనేజర్ కాదాసి శ్రీనివాస్ ఉద్యోగులను సన్మానించారు. ఆర్‌కే 7 గనిపై మేనేజర్ తిరుపతి రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. అన్ని గనులపై టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు.



కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నాం


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నామని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో నిర్వహించిన 7వ స్ట్రక్చర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సమావేశాల్లో తమ ముందుంచిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మందులు లేవని తమ దృష్టికి తీసుకురాగా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, పీఎం శ్యాంసుందర్, డీవై జీఎం సివిల్ రాములు, అధికారులు, గుర్తింపు సంఘం కేంద్ర కమిటీ సెక్రటరీ అక్బరలీ, మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్,నాయకులు రాజేశం, రమణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం

బెల్లంపల్లి, జూన్30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో రిసిక రాణించడం గొప్ప విషయమని ఏసీపీ రవి కుమార్ అన్నారు. సోమవారం ఏసీపీ కార్యాలయంలో 13వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో రాష్ట్రం తరుపున రిసిక పాల్గొని బంగారు పతకం సాధించినందుకు గాను ఏసీపీ అభినందించారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి చూపాలని క్రీడా కోటా కింద ఉద్యోగాలు సైతం సులువుగా సాధించవచ్చునన్నారు. అనంతరం రిటైర్డ్ అడిషనల్ డీసీపీ రవికుమార్ అభినందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, కోచ్ అజయ్ పాల్గొన్నారు.

బస్తీ సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి,జూన్30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డు కాంట్రాక్టర్ బస్తీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు బస్తీ వాసులు వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టర్ బస్తీలో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. వార్డులో ఎక్కడ చూసిన చెత్త మురుగునీరు పేరుకపోతుందని తెలిపారు. బస్తీ వాసులు కొలిపాక శ్రీనివాస్, మంతెన భాస్కర్, గోపి, పాల్గొన్నారు.

జీవో నంబర్-49 రద్దుచేయాలి

జన్నారం, జూన్30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మే 30న మహారాష్ట్రలోని తాడోబా, అందేరి రిజర్వు ఫారెస్టుతో కలుపుతూ కవ్వాల్ రిజర్వు ఫారెస్టులో కొమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరిధిలోగల 330 గ్రామాలను కలిపి గెజిట్ 49 జీవోను తీసుకొచ్చారని దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి సోమవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అబ్దుల్లా, ఆత్రం గంగు, మగ్గిడి జయ, ప్రమీల, రాజన్న, లింగన్న, బుచ్చయ్య, లక్ష్మణ్, రాజన్న పాల్గొన్నారు.

కోటపల్లి: జీవో నెంబరు 49ని రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నంలు కోరారు. సోమవారం మండలంలోని రొయ్యలపల్లి, సూపాక, ఆల్గామ, లింగన్నపేట గ్రామాల్లో జీవో 49 కాపీలను దగ్ధం చేయడంతో పాటు నిరసనలు వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, ముత్తయ్య, సమ్మయ్య, మహేష్, చిన్నన్న, మధునయ్య, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సలహా మండలి సభ్యుడిగా నాగరాజు

మందమర్రిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సంస్కృతిక సలహా మండలి సభ్యుడిగా పట్టణానికి చెందిన జాతీయ కళాకారుడు అంతడుపుల నాగరాజు నియమితులయ్యారు. సోమవారం ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన అనుచరలు స్వీట్లు పంపిణీ చేశారు.

వదంతులు నమ్మవద్దు

కోటపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా వదంతులను నమ్మవద్దని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మైనింగ్ శాఖ ఏడీ జగన్‌మోహన్‌రావులు అన్నారు. సోమవారం పారుపెల్లి చింత వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీ చెక్‌పోస్టును వారు సందర్శించారు. ఇసుక రవాణాలో ఎలాంటి అక్రమాలకు తావు లేదన్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడులు



- అరకొర వసతులు
- ఆరుబయట చదువులు
- జిల్లాలో 22 పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు కరువు
- నిలిచిపోయిన మన ఊరు-మనబడి పనులు

కాసిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సర్కార్‌బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తామని చెబుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇటీవల నిర్వహించిన బడిబాట సత్ఫలితాలను ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచితాలు, మధ్యాహ్న భోజన పథకాలపై తల్లి దండ్రులకు చెప్పడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది కూడ ప్రభుత్వ బడులు విద్యార్థులను సమస్యలతోనే స్వాగతం పలికాయి. జిల్లాలో 740 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 22 పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పిల్లలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. నేటికీ కూడ కూడ పిల్లలు ఒంటికి, రెంటికి ఇంటికి పరుగెడుతున్నారు.

34 బడుల్లో ఒకే ఒక్క బిల్డింగ్‌తో కాలం వెల్లదీస్తున్నారు. 2, 3, 4తరగతులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. లేదంటే ఉపాధ్యాయులు పిల్లలతో చెట్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో పిల్లల్లో ఏకగ్రత కోల్పోయి చదువులు చక్కగ సాగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 15 పాఠశాలలకు సొంత భవనాలు లేక శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు అద్దె ఇళ్లలో చదువులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులు సమస్యలతోనే సావాసం చేస్తూ చదువులు కొనసాగిస్తున్నారు. మెరుగైన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో కనిపించని మౌలిక సదుపాయాలు...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి విద్యార్థులను తీవ్రంగా వేధిస్తోంది. జన్నారం మండలం కలమడుగు ఎంపీపీ పాఠశాలలో 47 మంది విద్యార్థులు ఉండగా ఒక మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇళ్లకు పరుగెడుతున్నారు. దండేపల్లి మండలం నంబాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. భీమిని మండలం కేస్లాపూర్‌లో 35 మంది విద్యార్థులు బెల్లంపల్లి మండలం అంకూసం పాఠశాలలో 46 మంది విద్యార్థులు, బెల్లంపల్లి రాంనగర్‌లో 30 మంది విద్యార్థులు ఉన్నారు. కాని మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతున్నప్పటికీ మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థులకు శాపంగా మారింది.

బెల్లంపల్లి మండలం అంకూసం ఎంపీపీ పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక బడి ఆవరణలో గ్రీన్‌మ్యాట్ కట్టడం ప్రభుత్వ పాఠశాలలోని వసతుల లేమికి నిదర్శనంగా కనబడుతుంది. అదనపు తరగతి గదులు లేక విద్యార్థుల ఆరుబయటనే చదువులు కొనసాగుతున్నాయి. దీని వల్ల చదువులకు ఆటంకం కలుగుతోంది. పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సౌకర్యం నిర్వహణ సరిగ్గాలేక కంపుకొడుతున్నాయి. ప్రభుత్వం విద్యా రంగం, మౌలిక వసతులపై ప్రత్యేక చొరవ తీసుకొని మెరుగైన వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి.

నిలిచిపోయిన మన ఊరు మనబడి పనులు...

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించి విద్యారంగాన్ని పటిష్టం చేస్తామని చెప్పిన గత ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. వసతుల కల్పన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి జిల్లాలో 246 పాఠశాలలను ఎంపిక చేసి 56కోట్ల నిధులు విడుదలను కేటాయించింది. అదనపు తరగతి గదుల నిర్మాణం వంట గదులు, మూత్రశాలల మరుగు దొడ్ల నిర్మాణాలు ప్రహరీ, గేట్లతో పాటు అవసరం ఉన్న చోట మరమ్మతులు చేపట్టాలని నిధులను కేటాయించింది. కానీ 134 స్కూళ్లలో 22కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. చేసిన పనులకు సైతం ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో 112 పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గుత్తేదారులు ఆందోళన చేసిన ఘటనలు ఉన్నాయి. మన ఊరు మన బడిలో పాఠశాలల అభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు బడులకు తాళాలు వేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. మన ఊరు మనబడి పథకాన్ని తాత్కాలికంగా రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పనులను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ ప్రభుత్వ హయాంలోనైనా మెరుగైన వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు మెరుగుపరచాలి...
ఈదునూరి అభినవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంచిర్యాల



ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు మెరుగు పరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఆరుబయటే చదువులు కొనసాగిస్తున్నారు. టీచర్ల కొరత సైతం వేధి స్తోంది. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను, స్కావెంజర్‌లను వెంటనే భర్తీ చేయాలి. విద్యా రంగానికి 15శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చింది. కాని గడిచిన రెండు బడ్జెట్‌లలో 7.6శాతమే బడ్జెట్ కేటాయించడం బాధా కరం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలి క వసతులు కల్పించి మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం..
శ్రీనివాస్, సమగ్ర శిక్ష ప్లానింగ్ జిల్లా కోఆర్డినేటర్ మంచిర్యాల

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసే బడ్జెట్ ఆధారంగా పనులను కొనసాగించే విధంగా చర్యలు చేపడతాం. అదనపు తరగతి గదులు లేని చోట ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆటంకం కలుగకుండా చూస్తాం. వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.



'ఎత్తిపోతలు' ముగిసినట్లేనా...?

(5వ పేజీ తరువాయి)

అనుమతులు మంజూరు చేసింది. పథకంలో భాగంగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేసి జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లోని సుమారు ఎనిమిది వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందించేలా రూపకల్పన చేశారు.

ప్రారంభం కాని పనులు...

పడ్తనపల్లి ఎత్తిపోతల పథకానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలనా అనుమతులకే పరిమితం చేసింది. లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రూ. 80.50 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ 22-11-2022న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ జీవోఆర్టీ నెంబర్ 349 జారీ చేశారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా 2023 జూన్ 9న జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో లిఫ్టుకు శంకుస్థాపన చేయిస్తారనే ప్రచారం జోరుగా జరిగింది. జిల్లాలో పర్యటించిన కేసీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, ఆ జాబితాలో పడ్తనపల్లి లిఫ్టుకు చోటు లభించలేదు. పడ్తనపల్లి ఎత్తిపోతల పథకం మంజూరైతే తమ పంటలకు సాగునీరు అందుతుందని ఆశపడ్డ ఆయకట్టు రైతుల ఆశలు ఆదిలోనే ఆడియాశలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పడ్తనపల్లి లిఫ్ట్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తేనే సంతృప్తి



దండేపల్లిలో సింగతి కిషన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

దండేపల్లి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి నిజాయితీగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తే జీవితంలో ఎంతో సంతృప్తి కలుగుతుందని పీఏసీఎస్ రిటైర్డ్ సీఈవో బొడకుంటి రామ్‌కిషన్ అన్నారు. నెల్కివెంక టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి సింగతి కిషన్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం దండేపల్లిలో విశ్రాంత ఉద్యోగులు, రైతులు, స్నేహితులు పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. రైతులు ప్రజలకు సేవ చేసే అదృష్టం అందరికీ రాదన్నారు. 37ఏళ్ల ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి రైతుల మన్ననలు పొందాడన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు అక్కల చంద్రమౌళి, నెల్కి సత్యనారయణ. పసర్తి సత్తయ్య, ఉపాధ్యాయులు లచ్చన్న, హెడ్ కానిస్టేబుల్ కొట్టె తిరుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ అక్కల సతీష్, మిత్రులు తిరుపతి, శ్రీనివాస్, సత్యం, దుర్గయ్య, సిబ్బంది వెంకటేష్, రవి, సాయి పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

కోటపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు క్రమ శిక్షణ, అంకిత భావం, సేవలతోనే గుర్తింపు పొందుతారని డీఈవో యాదయ్య, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ అన్నారు. నక్కలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జి ఎంఈవో కె. వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఎంఈవో వెంకటేశ్వర్లు దంపతులను పూ లమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్‌లోని బారేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు పదవీ విరమణ పొందగా సోమవారం ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవి కుమార్, వెంకటేశ్వర్లు, జయప్రద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజీపూర్: గుడిపేటలో గల కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ జె. ప్రసాద్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. 2023లో మంచిర్యాల కేవీ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. విద్యార్థులు ఆయనకు గుర్తుగా మొక్కలు నాటారు. పాఠశాల సిబ్బంది ప్రిన్సిపాల్ దంపతులను ఘనంగా సన్మానించారు. కేవీ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా దిలీప్‌ను నియమించినట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

మంచిర్యాలక్రైం,జూన్30 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలకు పురస్కారాలను అందజేశారు. 2024-25 సంవత్సరంలో చేసిన సేవా కార్యక్రమాలకు గాను బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్‌క్లబ్ లయన్స్ క్లబ్ మంచిర్యాల, బ్లెడ్ డొనేషన్ క్యాంప్, ఐ స్క్రీనింగ్‌క్యాంప్, హెల్త్ క్యాంప్‌లలో ఉత్తమ సేవలను అందించినందుకు వ్యక్తిగత అవార్డు గ్రహీతలు లయన్ బాలమోహన్, మధుసూదన్ రెడ్డి, వినయ్‌కుమార్, రామాంజనేయులు, డాక్టర్ సుగుణారెడ్డి, డేగ బాపు, వెంకటేశ్వర్‌రావు ఈ పురస్కారాలు అందుకున్నారు.

బట్వాన్‌పల్లి గ్రామస్థుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, జూన్30 (ఆంధ్రజ్యోతి): బట్వాన్‌పల్లి గ్రామంలో పేరుకపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ క్రిష్ణకు గ్రామస్థులు వినతిప్రతం అందజేశారు. బట్వాన్‌పల్లి నుంచి తాల్ల గురిజాలకు వెళ్లే రహదారికి ఇరువైపుల దట్టమైన ముళ్లపొదలు పెరిగి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామంలో వీధిలైట్లు లేక పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని కుక్కలు చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయన్నారు. శ్రీనివాస్‌గౌడ్, వినోద్, హరిక్రిష్ణ, జనార్దన్, మల్లేశ్, పాల్గొన్నారు.



తహసీల్దాకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

భీమారం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సదానందం పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, ఐకేపీ, తహసీల్దార్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకు గురైన రోడ్డును కాపాడాలి

వేమనపల్లి : నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కాలువ పక్కన నిర్మించిన రోడ్డు కబ్జాకు గురైందని, కబ్జాకు గురైన రోడ్డును స్వాధీనం చేసుకోవాలని వేమనపల్లి రైతులు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కాలువ పక్కన రైతులు, ఇరిగేషన్ అధికారులు వెళ్లడానికి రోడ్డును నిర్మించారని, ఈ రోడ్డును కబ్జా చేసి కొందరు రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారన్నారు. దీంతో రోడ్డు అవతల ఉన్న చేన్లలోకి రైతులు వెళ్లడానికి దారి లేకుండా పోయిందన్నారు. వెంటనే కబ్జాకు గురైన రోడ్డును స్వాధీనం చేసుకుని దారిని ఏర్పాటు చేయాలని కోరారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

హాజీపూర్, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో అండర్ -12, 14 విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. అండర్-14 విభాగంలో ఎ. కిరణ్ కుమార్ 12 ఇయర్స్ విభాగంలో జి. సాయిచరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జులై 6న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ మోహన్, పీడీ శ్రీకాంత్, పీఈటీ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

జంగిల్ సఫారీ నిలిపివేత

జన్నారం, జూన్30 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జంగిల్ సఫారికి నేటి నుంచి విరామమని ఎఫ్‌డీవో రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జులై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటి ఆదేశాల మేరకు వర్షాకాలం సీజన్ వల్ల జంగిల్ సఫారిని నిలిపివేస్తున్నట్లు, వన్యప్రాణుల సంతానోత్పత్తి ఉన్నందున నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నల్లాల ఓదెలును పరామర్శించిన మంత్రి జూపల్లి

మందమర్రిటౌన్, జూన్30 (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలును హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సోమవారం రాష్ట్ర ఎక్సయిజ్ పర్యాటకశాఖ మంత్రి జూపెల్లి కృష్ణారావు పరామర్శించారు. మూడు నెలలుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి కోలుకున్న ఓదెలును ఆయన పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కూడా ఉన్నారు.

పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి

లక్షెట్టిపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలో గ్రామంలోని బడీడు పిల్లలను ప్రతీ ఒక్కరిని చేర్పించాలని మండల విద్యాధికారి శైలజ సూచించారు. సోమవారం లక్షెట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెం ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతి, ఉపాధ్యాయురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మల్లన్న స్వామి కల్యాణం

జైపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలో మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాలకు పవిత్ర గోదావరిలో స్నానాలను ఆచరించి ప్రత్యేక పూజలకు చేశారు. జైపూర్ ఎస్ఐ శ్రీధర్, ఆలయ ఈవో రమేష్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

మంచిర్యాలక్రైం,జూన్30(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబంతో ఆనందంగా గడపాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిని ఆయన శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. విరమణ పొందిన వారిలో ఎస్ఐ కె. వెంకటేశ్వర్‌రావు, ఎన్. చంద్రశేఖర్, అంజయ్యలు ఉన్నారు. అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్‌లు ఉన్నారు.

'మంత్రి ఇలాకాలో ఇసుక అక్రమ దందా'

కోటపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మంత్రి వివేక్‌వెంకటస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నూరు నియోజకవర్గంలో అక్రమ ఇసుక దందా కొనసాగుతుందని బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్ అన్నారు. సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి మండలంలోని ఎర్రాయిపేట ఇసుక క్వారీని సందర్శించారు. మంత్రి వివేక్‌వెంకటస్వామి ఇసుక దందా జరగడం లేదని అంటున్నారని, ఇక్కడ జరుగుతున్నది ఇసుక దందా వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు.

సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల వారీగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి చౌహాన్ అన్నారు. సోమవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, పౌరసరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వరిధాన్యం కొనుగోలు చేశామని, లక్ష్యానికి మించి కొనుగోలు చేయడం బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో కోటి 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని, నెలకు కనీసం9 లక్షల మెట్రిక్ టన్నులు డెలివరీ జరిగేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు జిల్లాలోని రైసుమిల్లులకు సామర్థ్యానికి అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ అధికారులు పాల్గొన్నారు.అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో డీఈవో యాదయ్యతో కలిసి నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటేషన్ 2025 కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించబడుతున్న నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటేషన్‌లో విద్యార్థులను భాగస్వాములను చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. హరిత జీవన విధానం నినాదంతో జులై 1 నుంచి ఆగస్టు 21 వరకు పోటీలు నిర్వహించి ఆగస్టు 30న ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి: ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యా అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. లెక్చరర్స్ క్రిష్ణవేణి, ప్రోగాం ఆఫీసర్ సోమయ్య పాల్గొన్నారు.

నెన్నెల : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నట్లు ఏఈవో రామ్‌చందర్ తెలిపారు.

మందమర్రిరూరల్ : మండంలోని పులిమడుగు గ్రామస్తులు ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను, మట్టిని తీసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఎంపీడీవో రాజేశ్వర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు.

నస్పూర్ : గ్రామ స్వరాజ్య సంస్థ, భారత జాతీయ మహిళ సమాఖ్య (ఎన్ఎఫ్ ఐడబ్ల్యూ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని నస్పూర్‌లో సోమవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ ప్రారంభించా రు. శిక్షకులు సంధ్య, యాదలక్ష్మి, సంధ్య, ఆశ, పావని, సుకన్య, శ్రీదేవి పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

మంచిర్యాల కలెక్టరేట్ : పట్టణంలోని ఒడ్డెర కాలనీలోని పోచమ్మ గుడి వద్ద సోమవారం వంద రోజుల సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. వైద్యులు రాము, రజితలు 82 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 21 మందిని ఎక్స్‌రే కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మందులు అందించారు.

గోరింటాకు సంబరాలు



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

మందమర్రిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి రామకృష్ణపూర్‌లోని మహిళలు సోమవారం గోరంటాకు సంబరాలు చేసుకున్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని తమ చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. కాలనీల్లో మహిళలందరు ఒక చేట చేరి సంబరాలు నిర్వహించారు. వర్షాకాలం ఆరంభంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని మహిళలు తెలిపారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలి



ఎన్నికలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్, ఎస్ఐ

బెల్లంపల్లి, జూన్30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలని, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని తెలంగాణ సాంఘీక సంక్షేమ కాసిపేట గురు కుల పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం పాఠశాలలో స్టూడెంట్ అకాడమిక్ యాక్టివిటీలో భాగంగా స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కెప్టెన్, వైస్ కెప్టెన్ ప్రజా పద్ధతిలో ఎన్నికల నిర్వహణ కోసం విద్యార్థులకు ఓటు హక్కు కల్పించారు. నలుగురు వైస్ కెప్టెన్‌లు, నలుగురు కెప్టెన్‌లు పోటీలో నిలబడ్డారు. పోలింగ్ ఆఫీసర్, బూత్ ఏజెంట్లను మైక్రో అభ్యర్థులను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రజా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని ప్రిన్సిపాల్ తెలిపారు. తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్, అధ్యాపకులు నరేందర్, రమేశ్, శ్రీనివాస్, మంజుల, శైలజలు పాల్గొన్నారు.



అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే సమాచారం ఇవ్వండి

కాగజ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని పట్టణం, మండలాల్లో మద్యం అక్రమంగా అమ్మకాలు జరిపితే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి జ్యోతికిరణ్ ఒక ప్రకటనలో కోరారు. దేశీదారు, గుడుంబా, అక్రమ మద్యం అమ్మి నా వెంటనే 8712658784, 9494250050, 9542513101కు సమాచారం అందించాలని కోరారు.

అడిషనల్ కలెక్టర్ విచారణ

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామస్థులు అక్రమ మద్యం, బెల్టు షాపులపై చేసిన ధర్నాపై సోమవారం అడిషనల్ కలెక్టర్ ఎం డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి విచారణ చేపట్టారు. గ్రామంలో ప్రస్తుతం ఎలాంటి బెల్టుషాపులు లేవని, భవిష్యత్తులో కూడా ఎటువంటి నాటుసారా, మద్యం అమ్మకాలు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆయన ఆదేశించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ మంజూరైనట్లు తెలిపారు. చదువు మధ్యలో ఆపేసిన వారు ఉన్నత చదువుల కోసం ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులే తనిఖీ అధికారులు

- పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు
- బోధన, హాజరు, కనీస వసతులు పరిశీలన



పాఠశాలలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్ (ఫైల్)

వాంకిడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాలల పర్యవేక్షణకు ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమించనుంది. ప్రస్తుతం ప్రతీ మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కోసం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈవోలు అధికారులుగా ఉన్నారు. తాజాగా ఉపాధ్యాయులను కూడా తనిఖీ అధికారులుగా నియమించనున్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీలో వారిని ఎంపిక చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అందుకోసం పదేళ్ల అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 4న నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పాఠశాలల వివరాలు...

ప్రాథమిక పాఠశాలలు	526
ప్రాథమికోన్నత పాఠశాలలు	99
ఉన్నత పాఠశాలలు	60
పనిచేస్తున్న ఉపాధ్యాయులు	2,072

● పరిశీలన ఇలా...

జిల్లాలో 526 ప్రాథమిక పాఠశాలలు, 99 ప్రాథమికోన్నత పాఠశాలలు, 60 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. తనిఖీ అధికారులుగా నియమితులైన ఉపాధ్యాయులు జిల్లా పరిధిలోని పాఠశాలలను తనిఖీ చేస్తారు. మౌలిక వసతులు, గ్రంథాలయాలు, ప్రయోగ శాలలు, క్రీడలు, డిజిటల్ విద్యాబోధన, విద్యార్థుల ఆరోగ్యం, మరుగు దొడ్లు, తాగునీరు, ప్రహరీలు, విద్యుత్ సౌకర్యం, క్రీడాస్థలాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించాలి. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూని ఫామ్స్ అందుతున్నాయా? అని తెలుసుకోవాలి. మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వంటివి పరిశీలించాలి. డీఈవోలకు ప్రతీ నెల 5వ తేదీ లోపు నివేదికలు అందించాలి. వాటిని ప్రతీ నెల కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షిస్తారు. ఎంపికైన ఉపాధ్యాయులు ఏడాది పాటు పనిచేస్తారు. నిబంధనల ప్రకారం జిల్లాలో పీఎస్‌ల పరిధిలో ఇద్దరు, యూపీఎస్‌ల పరిధిలో ఒకరు, ఉన్నత పాఠశాలల పరిధిలో ఒక ఉపాధ్యాయుడిని నియమించే అవకాశం ఉంది.

నియామకం ఇలా...

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల తనిఖీ కోసం కనీసం పదేళ్ల అనుభవం ఉన్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లేదా ఎస్‌జీటీలను నియమించుకోవచ్చు. వారు నిత్యం రెండు పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది.
- ప్రాతమికోన్నత పాఠశాలల తనిఖీ కోసం పదేళ్ల అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలి. వీరు ప్రతీ రోజు రెండు పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది.
- ఉన్నత పాఠశాలల తనిఖీ కనీసం పదేళ్ల అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలి. వీరు రోజుకు ఒక పాఠశాలను మూడునెలల్లో 50 పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. దాంతో పర్యవేక్షణ పెరిగి పాఠశాలల పనితీరు మెరుగుపడే అవకాశం ఉంది.

కుంగిన కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం



కుంగి పోయిన కల్వర్టు

బెజ్జూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీలో ఓ పంక్షన్ హాల్ వెనుక ఉన్న కల్వర్టు కుంగిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలం భారీ వర్షాలు కురిసిస్తే కల్వర్టు పూర్తిగా కుంగిపోయే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కల్వర్టు పక్కకు రోడ్డు కూడా కోతకు గురి కావడంతో కనీసం ఎడ్ల బండి కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ రాజేందర్

కాగజ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన కమిషనర్ అంజయ్య చెన్నూరు మున్సిపాలిటీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉన్న రాజేందర్‌ను కమిషనర్‌గా నియమిస్తూ సీడీఎంఏ ఉత్తర్వులను జారీ చేశారు. ఈమేరకు రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు.

కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకుదుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారితో కలిసి ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గదుల్లో విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, భవనాలు, బెంచీలు, ఇతర ఫర్నీచర్, కంప్యూటర్, ప్రింటర్ కోసం అవసరమైన జాబితాను సిద్ధం చేసి అందజేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధి అధికారులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి: కలెక్టర్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

రెబ్బెన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సోమవారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి సీతారాంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వార్డులు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమునా ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. పలు పాఠశాలలను కూడా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సూర్యప్రకాష్, మండల వ్యవసాయాధికారి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారులనుంచి దరఖాస్తులు స్వీకరించారు.

రెబ్బెన మండలం పర్శనంఆలకు చెందిన మాదవ్ తనకు వృద్ధాప్య పించన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఆసిఫాబాద్ మండలం వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన శోభ తాను సాగు చేస్తున్న భూమిని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌కు చెందిన శంకర్ తనకు మండలంలోని సామెల శివారులో గల భూమికి నూతన పట్టా పాసు పుస్తకం జారీ చేయాలని అర్జీ సమర్పించాడు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడికి చెందిన నీలాబాయి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ మండలం ఈసుగాం గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని అర్జీ సమర్పించారు.

కౌటాల మండలం కనికి గ్రామానికి చెందిన శంకరక్క తన పేరిట ఉన్న పట్టా భూమికి తెలంగాణ పాసు పుస్తకం జారీ చేయాలని అర్జీ సమర్పించారు. జైనూరు మండలం కొండిగూడ గ్రామానికి చెందిన సునీత తాను బీఎస్సీ, బీఈడీ చదివానని జిల్లాలో తన అర్హతకు తగ్గ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం గౌరి గ్రామానికి చెందిన రవిత తన భర్తకు ఆరోగ్యం బాగలేదని ఆర్థికంగా ఎలాంటి ఆధారం లేదని, తనకు ఏదైనా వసతి గృహంలో ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను సర్దుబాటు చేయాలి

ఆసిఫాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం రెగ్యులర్ అధ్యాపకుల నియామకంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తూ డిస్టర్బ్ అయిన అతిథి అధ్యాపకులను జిల్లాలోనే సర్దుబాటు చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అయ్యే ఖాళీల్లో అతిథి అధ్యాపకులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మారుతి, రాంబాబు, సత్యనారాయణ, రాజన్న, మహేష్, సరళ, సుశీల్, ఉదయశ్రీ, నవ్య, సునీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆర్మీ శివకుమార్ సోమవారం నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి, వెంకటేష్, రాజ్‌కుమార్, ప్రశాంత్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

కెరమెరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని ఎంఈవో ప్రకాష్ అన్నారు. గోయగాం ఎంపీపీఎస్ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ ఆంగ్ల మాధ్యమ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, ఉపాధ్యాయులు భరత్, రమేష్, విష్ణుగౌడ్, రవితేజ, గ్రామస్తులు శంకర్, బాపూజీ, రాందాస్, సురేష్, సునీల్, హీరాజీ, పోశెట్టి, అదిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

ఆసిఫాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో పని చేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన ఉద్యోగులను డిపో మేనేజర్ రాజశేఖర్ ఘనంగా సన్మానించారు. డిపోలో ఏడీసీగా పని చేస్తున్న ఎస్ చంద్రశేఖర్, డ్రైవర్ మహబూబ్, మొహహీనుద్దీన్, కండక్టర్ శ్రీనివాస్ పదవీ విరమణ సందర్భంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంఎఫ్ ఉదయ్, టీఐ-3 నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

సిర్పూర్(టి), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం సిర్పూర్(టి) ఐసీడీఎస్ కార్యాలయంలో సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, అర్చన, విమల, రుక్మ, సాహేర, దేవి, సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరులో భారీ వర్షం

బెజ్జూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రైతులు సాగు చేస్తున్న పంటలకు మేలు కలుగజేస్తుందని రైతులు తెలుపుతున్నారు. ఇప్పటికే విత్తనాలు మొలకత్తుతుండడంతో ఎదుగుదలకు ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. కాగా సోమవారం ఉదయం నుంచి కూడా ఓమోస్తారుగా వర్షం కురుస్తుం డడంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. పలు గ్రామాలకు పక్కా రోడ్లు లేకపోవడంతో మొరం రోడ్లన్నీ బురదమయంగా తయారు కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కురిసిన వర్షం కారణంగా వారసంత స్థలం పూర్తిగా బురద మయంగా మారింది.



బురదమయంగా మారిన వార సంత స్థలం

ఆర్థిక సహాయం అందజేత

పెంచికలపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి చెందిన రాజశేఖర్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం మృతుడి తల్లికి ఆదిత్య వైన్స్ తరపున వ్యాపారవేత్త గజ్జెల శ్రీనివాస్, ఇస్మాయిల్, తాజ్ 25 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సంజీవ్, సుధాకర్, తిరుపతి, సాజిత్, శ్రీనివాస్, మారయ్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కపై విమర్శలు సరికాదు

బెజ్జూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి సీతక్కపై కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్‌కు గురైన రావి శ్రీనివాస్ విమర్శలు చేయడం సరికాదని నాయకులు విశ్వేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంత్రి సీతక్కను ఏకవచన ంతో అగౌరవపరిచేలా వ్యక్తిగత దూషణలు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్, జగ్గాగౌడ్, సుగుణ, శంకర్ పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

రెబ్బెన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గంగాపూర్ రైల్వే గేటు మూడు రోజులపాటు మూసివేసి ఉంటుందని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి మూడో తేదీ వరకు రైల్వే గేటు బంద్ చేస్తామని వివరించారు. మరమ్మతుల దృష్ట్యా ఈ గేటు మూసి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు.

మంత్రి సీతక్క ఒత్తిడితోనే సస్పెన్షన్



సమావేశంలో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క ఒత్తిడి చేయడం వల్లనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని సిర్పూర్ నియోజకవర్గ నాయకులు రావి శ్రీనివాస్ అన్నారు. సోమ వారం స్థానికంగా తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పదేళ్లు ప్రతిపక్షంలో ఉండి ప్రజలకు సేవ చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీలో కమీషన్లు ఇచ్చుకుంటూ రాజకీయం చేయడం తనతో కాదన్నారు. తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరేది లేదన్నారు. జిల్లాలో జైనూరు ఘటనలో మైనారిటీలకు, ఆదివాసీలకు మధ్య జరిగిన ఘర్షణల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతకకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో ఓటమికి సీతక్కనే కారణమన్నారు. గతంలోనూ తనను బహిష్కరించినా జిల్లాలో పార్టీ కోసం పోరాడే వ్యక్తిగా తనకు పార్టీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉండి రానున్న ఎన్నికల్లో తన సత్తా చూపిస్తానన్నారు. అనంతరం పార్టీ మండల, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. సమావేశంలో నాయకులు మరళీధర్, వివిధ మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి

కాగజ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెన్షన్‌కు గురైన రావి శ్రీనివాస్ మంత్రి సీతక్కపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్సీ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ, మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుపై అధిష్ఠానానికి తప్పుడు ఫిర్యాదులు చేయటం ఎంత వరకు సమంజసమన్నారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని రావి శ్రీనివాస్‌ను ఆరేళ్ల పాటు సస్పెండు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. రావి శ్రీనివాస్ అంకుసాపూర్ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ పెడుతున్నారని, ఇందుకు పలు సమస్యలు రావటంతో మంత్రి సీతక్కను సహరించాలని కోరగా నిరాకరించటంతో లేనిపోని ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు షబ్బీర్ హుస్సైన్, శరత్ ముదిరాజ్, మహేష్, మురళీగౌడ్, యూసుఫ్ ఖాన్, రాణాసింగ్, రవిపటేల్, మోహన్, దీపక్ పాల్గొన్నారు.